క్లుప్తంగా

కొత్తపల్లిలో వైద్యశిబిరం



మద్దూరు: కొత్తపల్లి మండల కేంద్రంలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కీళ్ల, ఒళ్ల నొప్పులు, ఫీవర్, బీపీ, షుగర్‌కు సంబంధించిన పరీక్షలు చేశారు. దాదాపు 45 మందికి పరీక్షలు నిర్వహించగా ఇద్దరికి ఆర్థరైటీస్, ముగ్గురికి ఫీవర్, మిగిలిన 40 మందికి సాధారణ వ్యాధులు ఉన్నట్లు గుర్తించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతులకు వీడియో కాన్ఫరెన్స్

ఊట్కూరు: మండలంలోని కొల్లూరులోని రైతు వేదిక భవనంలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు ఆధునిక సాంకేతిక విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ గణేష్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మంగళవారం 10 గంటల నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామని, మండలంలోని రైతులు విధిగా హాజరు కావాలని కోరారు.

ఉపాధ్యాయులకు సన్మానం



మద్దూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు రాజరత్నం, సుజాత పదోన్నతిపై బదిలీపై వెళ్తుండడంతో సోమవారం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ పాఠశాలలో నిబద్ధతతో విధులు నిర్వహించి, పదోన్నతిపై బదిలీ వెళ్లడం సంతోషకరమన్నారు. మీ సేవలు ఇలాగే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో లాజర్, దాసు, రవి, గోపాల్, శేఖర్, ప్రవీణ్, వంశీ, కృష్ణ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ గీతకు వైద్యరత్న పురస్కారం



నారాయణపేట రూరల్: పట్టణంలోని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ గీతకు హైదరాబాద్ మదర్ థెరీస్సా ఫౌండేషన్ వారు వైద్యరత్న అవార్డును బహుకరించారు. జిల్లాలో ఆమె పేద రోగులకు చేస్తున్న సేవలను గుర్తించి సోమవారం రవీంద్రభారతితో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ మోహన్‌రావు చేతుల మీదుగా శాలువాతో సత్కరించి పురస్కారం అందించారు. ఈ మేరకు డాక్టర్ విశ్వనాథ్, బాలకేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి అభినందించారు.

పోచమ్మ ఆలయం ముస్తాబు



మరికల్: మండల కేంద్రంలో జరిగే పోచమ్మ బోనాల వేడుకలకు సోమవారం అమ్మవారి ఆలయాన్ని నిర్వాహకులు విద్యుత్‌కాంతులతో ముస్తాబు చేశారు. మంగళవారం ముందుగా కురువలు అంబలి బోనం వెళ్లిన తర్వాత సాయంత్రం పోతురాజుల వేషాలతో భక్తులు అమ్మవారి బోనాలతో తరలివెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. ఇందుకోసం పోచమ్మ ఆలయాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించారు.

నిరుపయోగంగా కేజీబీవీ భవనం

- 2.5 కోట్లతో నిర్మాణం
- మౌలిక వసతులు లేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



కొనసాగుతున్న ప్రహరీ పనులు



పులిమామిడిలో నిరుపయోగంగా కేజీబీవీ నూతన భవనం

ఊట్కూర్: ప్రభుత్వం బాలికల విద్యాభివృద్ధి కోసం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో మండలంలోని పులిమామిడిలో 2.5 కోట్లతో కేజీబీవీకి అదనపు భవనం నిర్మించారు. ఈ భవన ప్రారంభోత్సవం చేపట్టి ఏడాది గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల భవనాన్ని పాఠశాలకు అప్పగించకపోవడంతో నిరుపయోగంగా ఉంది. దీంతో పాత భవనంలో విద్యార్థులకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. పులిమామిడిలోని కేజీబీవీ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 253 మంది, ఇంటర్‌లో 160 మంది బాలికలు ఉన్నారు.

నాలుగేళ్ల క్రితం

రూ. 2.5 కోట్లతో పులిమామిడి కేజీబీవీలో తరగతి గదులు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, గదుల్లో ఫ్యాన్లు తదితర వసతులను ఏర్పాటు చేశారు. కొత్త భవనం నిర్మాణం చేపడితే తమ సమస్యలు తీరుతాయని ఎదురుచూస్తున్న విద్యార్థులకు నిరాశ మిగిలింది. కొత్త భవనం నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసి తరగతులను ప్రారంభించారు. భవనం పనులు సకాలంలో పూర్తి చేపట్టకపోవడంతో ఇంటర్మీడియట్ విద్యార్థులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలల క్రితం ప్రహరీ పనులు ప్రారంభించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భవనం పనులను పూర్తిచేసి పాఠశాలకు అప్పగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వారం రోజుల్లో అప్పగిస్తాం

కేజీబీవీ కోసం భవనం ప్రారంభోత్సవం చేపట్టి నిరుపయోగం ఉన్న విషయం వాస్తవం. కాంట్రాక్టర్ మారడం వల్ల పనులు సకాలంలో పూర్తికాలేదు. భవనం ప్రహరీ పనులు కొనసాగుతున్నాయి. వారం రోజుల్లో పనులు పూర్తిచేసి భవనాన్ని పాఠశాలకు అప్పగిస్తాం.

– రాము, డీఈ, ఎస్ఎస్ఏ, మహబూబ్‌నగర్

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

ధన్వాడ: పార్టీలకు సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ కల్యాణలక్ష్మి అందుతుందని ఎమ్మెల్యే డాక్టర్ పర్ణికారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 114 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి పథకాలు చేరుతున్నాయన్నారు. ప్రజలు ఎవరూ కూడా దళారులను నమ్మొద్దని, వాటికి సంబంధించిన అన్ని పత్రాలు అధికారులు అందిస్తే ఎక్కడా పెండింగ్ లేకుండా వేగంగా చెక్కులను మంజూరు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌కుమార్, తహసీల్దార్ సింధూజ, ఎంపీడీఓ సాయిప్రకాష్, వ్యక్తిగత పీఏ మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరహరి, వెంకట్రాములు, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

మరికల్: మండల కేంద్రంలోని రైతువేదిక ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మండలంలోని 57మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. అలాగే మక్తల్ నియోజకవర్గం పరిధిలోని నాలుగు గ్రామాలకు సంబంధించి 15 చెక్కులను త్వరలోనే మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీదుగా పంపిణీ చేయిస్తామని తహసీల్దార్ సునీత తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీశైలం, సుధాకర్‌రెడ్డి, గోపాల్‌రావు, నాయకులు సూర్యమోహన్, వీరన్న, కృష్ణయ్య, హరీష్, ఆంజనేయులు, చిన్నబాలు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు అవగాహన



చిన్నపొర్ల పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

ఊట్కూరు: మహిళలకు, బాలికలకు అండగా షీ టీం పోలీసులు పనిచేస్తున్నారని బాలరాజు అన్నారు. సోమవారం మండలంలోని చిన్నపొర్ల పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యుడు బాలరాజు మాట్లాడుతూ మహిళలపై, చిన్నపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు అరికట్టాలనే ఉద్దేశ్యంతో పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బాలికలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరిని నమ్మరాదని, ఎవరిపైన అనుమానం వచ్చినా షీ టీం సభ్యులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరానికి గురైతే 1930కి సమాచారం ఇవ్వాలన్నారు. మహిళలు, బాలికల రక్షణ వారి భద్రత కోసం షీ టీం పనిచేస్తుందని ఆపద సమయంలో షీ టీం నెంబర్ 8712670398కు ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్నాథ్‌రావు, షీటీం పోలీసులు సమీన, దేవి, రాధిక, చెన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినికి అస్వస్థత



ఎస్వీఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని చైతన్య

మద్దూరు: మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థి అస్వస్థకు గురికావడంతో విద్యార్థిని తల్లిదండ్రులు సోమవారం మహబూబ్‌నగర్‌లోని ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రులు జగదీష్, లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఖాజీపూర్ గ్రామానికి చెందిన చైతన్య మద్దూరు ఎస్సీ గురుకుల పాఠశాలలో 8 వ తరగతి చదువుతుంది. గత నెల 24న జ్వరం రావడంతో తమకు సమాచారం ఇవ్వడంతో అమెను స్థానికంగా ఉన్న ఆస్పత్రిలో చూయించి, అక్కడి నుంచి నారాయణపేట ఆస్పత్రికి తరలించారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో డాక్టర్ల సూచన మేరకు సోమవారం ఎస్వీఎస్‌కు తరలించారు. విద్యార్థికి పరీక్షలు నిర్వహించి ఆమెకు కలుషిత నీరు తాగడం వల్ల అనారోగ్యం పాలైందని డాక్టర్లు తెలిపినట్లు తల్లిదండ్రులు తెలిపారు. ఇదే విషయంపై పాఠశాల ప్రిన్సిపాల్ భారతిని వివరణ కోరగా.. గత నెల అనారోగ్యానికి గురైన విద్యార్థిని ప్రథమ చికిత్స అందించి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. కలుషిత నీరు రావడం లేదని తెలిపారు. ఈ విషయం ఎంపీడీఓకు తెలియడంతో అక్కడికి ఎంపీఓ రామన్న, పంచాయతీ కార్యదర్శి వెళ్లి నీటి సరఫరాను పరిశీలించారు. పాఠశాల ప్రిన్సిపాల్ భారతి ఆస్పత్రి వెళ్లి విద్యార్థిని పరామర్శించినట్లు తెలిసింది.

పీర్ల మసీద్ స్థలాన్ని కాపాడాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ముస్లిం కమిటీ సభ్యులు

అమరచింత: పట్టణంలోని పదో వార్డులోని బుడుకల వీధిలో ఉన్న అడ్డాకుల ఖాసీం పీర్ల మసీదు శిథిలమై కొన్నేళ్లుగా ఖాళీగా ఉంది. దీంతో ఆ స్థలాన్ని కొంతమంది కబ్జా చేయడానికి యత్నించారంటూ మున్సిపల్ కమిషనర్‌కు ముస్లిం కమిటీ సభ్యులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా పట్టణ ముస్లిం కమిటీ సభ్యులు మాట్లాడుతూ పీర్ల మసీదు ఖాళీ స్థలాన్ని కొందరు గ్రామ పంచాయతీ నుంచి అనుమతి ఉందని తప్పుడు పత్రాలతో మసీదు స్థలంలో ఇంటి నిర్మాణం కోసం ప్రయత్నించడం ఎంత వరకు సమంజసం అన్నారు. బుడుకల వీధిలోని అడ్డాకుల మసీదు స్థలం ఇతరుల చేతిలో కబ్జాకు గురికాకుండా అక్రమాలకు పాల్పడిన సదరు వ్యక్తులపై చర్యలు తీసుకొని మసీదు స్థలాన్ని కాపాడాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నురుల్ నదీం మాట్లాడుతూ సమగ్రంగా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తౌఫిక్, పాషా, ఆశ్వక్, బడేసా, నబి తదితరులు పాల్గొన్నారు.

నేడు సినీనటి మంచు లక్ష్మి రాక

నారాయణపేట రూరల్: ప్రముఖ సినీనటి మంచు లక్ష్మి మంగళవారం నారాయణపేట జిల్లాకు రానున్నారు. వెనిరావు ఫౌండేషన్ వారి టీచ్ ఫర్ ఛేంజ్ ఆధ్వర్యంలో కొల్లంపల్లి జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్‌లను ఆమె ప్రారంభించనున్నారు. ఉదయం 10.30గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఫౌండేషన్ సభ్యులు రత్నంరెడ్డి, డీఈఓ ఎండీ అబ్దుల్‌ఘని హాజరవుతున్నట్లు కాంప్లెక్స్ హెచ్‌ఎం అనురాధ తెలిపారు.

ధ్యానం ప్రతి ఇంటికి చేరాలి



ఆంజనేయులును సన్మానిస్తున్న కో ఆర్డినేటర్లు

నారాయణపేట రూరల్: ధ్యానం చేయడం వల్ల కలిగే లాభాలను ప్రతి ఇంటికి చేర్చాలని శ్రీరామ చంద్ర మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ గద్దె ఆంజనేయులు కోరారు. స్థానిక శ్రీసాయి హనుమాన్ ఆలయంలో శ్రీసాయి విజయకాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన ఉచిత ధ్యాన (మెడిటేషన్) శిబిరంలో పాల్గొని శిక్షణ పొందిన కోఆర్డినేటర్లకు సోమవారం గుర్తింపుకార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభించి ఆరోగ్యకరంగా తయారవుతారన్నారు. ధ్యానం చేయడం వల్ల కలిగే ఉపయోగాలు, చేసే విధానం ప్రతి ఒక్కరికీ తెలియచేయాలని కోరారు. అన్ని వయస్సుల వారు ప్రతీ రోజు గంట పాటు ధ్యానం చేయాలన్నారు. ఆరోగ్యంతో పాటు వివేకం, విజ్ఞానం పెంపొందిచబడుతాయన్నారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించి, మొక్కను బహుకరించారు. కార్యక్రమంలో గందె ఉమాకాంత్, డాక్టర్ మధన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సేవలు మరువలేనివి



ధన్వాడలో వైఎస్సాఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ముక్తిపాడులో..



పాథర్చేడ్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కర్ని గంగాధర్

కోస్గి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతిని పురస్కరించుకొని సోమవారం మండలంలోని ముక్తిపాడ్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పేదల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలతో నేటికీ పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని ఆ పార్టీ నాయకులు వైఎస్సార్ సేవలను కొనియాడారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిష్టప్ప, బాల్‌రాజ్, రాజు, మల్లేష్, శ్రీశైలం, నర్సయ్య, అంజి తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: దివంగత ముఖ్యమంతి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ జెండా కట్ట వద్ద వైఎస్సార్ జయంతి వేడుకలను ఆయన అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించారు. మహానేత వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు నరహరి, శివకుమార్, లక్ష్మణ్‌గౌడ్, వెంకట్రాములు, యూసుఫ్, మైముద్, బాలకృష్ణ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు

మహానేతకు ఘన నివాళి

నర్వ: మహానేత దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాథర్చేడ్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు కర్ని గంగాధర్ పాల్గొని పూలమాలలు వేశారు. మహానేత ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, 104, రుణమాఫీ, సాగునీటి ప్రాజెక్టుల ఏర్పాటు వంటివి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో నాయకులు మైబు, నాగరాజ్‌రెడ్డి, ఎల్లప్ప, రవి, వెంకటేష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ ఆత్మహత్య కారకులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

కోస్గి: ఖమ్మం జిల్లా అశ్వరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తూ సీఐ, ఇతర సిబ్బంది వేధింపులతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో బాధ్యులను కఠినంగా శిక్షించాలని పలు దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ సోమవారం స్థానిక శివాజీ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. దళితుడైన కారణంగా పోలీస్ అధికారికి కూడా వేధింపులు తప్పడం లేదంటే సామాన్య ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో స్పందించి ఎస్ఐ మృతికి కారకులైన సీఐ, ఇతర సిబ్బందిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఐ దస్రూనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పాలమూర్ జేఏసీ అధ్యక్షుడు కామారం వెంకటేష్, జాతీయ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా నాయకుడు గుండ్లపల్లి లక్ష్మణ్, చిన్న కృష్ణ, కేపీ వెంకటయ్య, వెంకటేష్, తిరుమల్, బుగ్గప్ప, కన్నప్ప, అనంతయ్య పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కోస్గి: పాలమూర్ ఎంపీగా డీకే అరుణ విజయం సాధించిన నేపథ్యంలో ఈ నెల 10న బుధవారం కోస్గిలో నిర్వహించనున్న బీజేపీ విజయోత్సవ ర్యాలీ, అరుణకు అభినందన సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రతాప్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు సోమవారం స్థానిక నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కోస్గిలోని రామాలయం చౌరస్తా నుంచి శివాజీ చౌరస్తా వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ర్యాలీ అనంతరం స్థానిక ఏబీకే ఫంక్షన్ హాల్‌లో ఎంపీగా విజయం సాధించిన డీకే అరుణకు అభినందన, సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలి రావాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సీబీ వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, బీజేవైఎం జిల్లా నాయకుడు బద్రీనాథ్, నాయకులు కిరణ్ కుమార్, అంబదాస్, దామోదర్‌రెడ్డి, మద్దూర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగు వివరాలు నమోదు



పంటలను నమోదు చేస్తున్న ఏఈఓ వినోద్

కోస్గి: రైతులు సాగు చేసిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేస్తున్నామని, వ్యవసాయ శాఖ అధికారులకు రైతులు తమ పంటల వివరాలు అందజేయాలని ఏఈఓ వినోద్ సూచించారు. ఈ మేరకు సోమవారం మండలంలోని పోలేపల్లి శివారులో రైతుల పొలాలను పరిశీలించి వానాకాలంలో సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించే పంటల సాగు వివరాలను రైతుబీమా, రైతు భరోసా, పంటలబీమాకు ప్రామాణికంగా తీసుకొంటుందని, రైతులు విధిగా తమ పంటలను నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో పచ్చిరొట్ట ఎరువులను సాగు చేసిన రైతుల పొలాల్ని సందర్శించి పూత దశలో భూమిలో కలియ దున్నాలన్నారు.

నాటిన ప్రతి మొక్కనూ రక్షించాలి



తళంకేరి రోడ్డుకు మొక్కలు నాటుతున్న పంచాయతీ కార్యదర్శి మల్లేష్

మాగనూర్: నాటిన ప్రతి మొక్కనూ రక్షించాలని గురువలింగంపల్లి పంచాయతీ కార్యదర్శి మల్లేష్ యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని గురువలింగంపల్లి నుంచి తళంకేరి గ్రామ రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. గ్రామాల్లో నాటిన మొక్కలకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కాపాడాలని సూచించారు. గురువలింగంపల్లిని కాలుష్య రహిత గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడానికి ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం మొక్కలు నాటే పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ మేటి గణేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు సమంజసం కాదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు బీసం చెన్నయ్యసాగర్

నర్వ: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిపై అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవపట్టించే విధంగా ఓ దినపత్రికలో కథనాలు రాయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్ అన్నారు. సోమవారం సాయంత్రం నర్వ సీనియర్ నాయకులు జలందర్‌రెడ్డి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ బిడ్డగా నియోజకవర్గ ప్రజల మనస్సు చూరగొని ఎమ్మెల్యేగా గెలిచి, త్వరలో మంత్రి అవుతాడానే అక్కసుతోనే ఇలాంటి తప్పుడు ఆరోపణలు, ప్రకటనలు చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. సమావేశంలో నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, శివంత్‌రెడ్డి, శరణప్ప, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వివేకవర్ధన్‌రెడ్డి, రవికుమార్, హన్మంతురెడ్డి, నర్సింహపాల్గొన్నారు.

ఎంపీని సన్మానించిన బీజేపీ నాయకులు



మాగనూర్‌లో ఎంపీ డీకే అరుణను సన్మానిస్తున్న నాయకులు

మాగనూర్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలుగా గెలుపొందిన సందర్భంగా మొదటి సారిగా మక్తల్ నియోజకవర్గంలోని మాగనూర్‌కు వచ్చిన ఎంపీ డీకే అరుణను మండల బీజేపీ నాయకులు సోమవారం శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. డీకే అరుణ ఎంపీగా గెలుపొందిన సందర్భంగా విజయోత్సవ ర్యాలీకి ఆమె రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. మాగనూర్ మండల అభివృద్ధికి ఆమె కృషి చేస్తుందన్నారు. అరుణ గెలుపు కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోకుర్‌సాబ్ ఉత్సవం



గోకుర్‌సాబ్ దర్గా దగ్గర మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మాగనూర్: మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పక్కన వెలసిన గోకుర్‌షాబ్ ఉత్సవం సోమవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గోకుర్‌సాబ్ ప్రసాదాలు(మాల్లిజ)సమర్పించారు. ప్రతి సంవత్సరం వానాకాలం ప్రారంభం సందర్భంగా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

చావిడీల్లో కొలువైన పీర్లు



అమరచింత పెద్ద మసీదులో కొలువుదీరిన ఇమామే ఉస్సేన్ అలం, బీబీ ఫాతిమా అలం

అమరచింత: మొహర్రం నెల మొదటి రోజును పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లోని పీర్ల చావిడీల్లో ఆలంలు (పీర్లు) కొలువుదీరాయి. పది రోజుల పాటు గ్రామాల్లో ప్రజలు కులమతాలకు అతీతంగా మతసామర్యం ఉట్టిపడేలా పీర్ల పండుగను సామూహికంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. పీర్ల పండుగ మొదలైన ఐదో రోజు నుంచి ప్రతి నిత్యం ఒక ఆలం ను ఊరేగిస్తారు. మొహర్రం ఐదో రోజు తానే అబ్దుల్లా ఆలం, ఆరో రోజున అబ్బాసలీ ఆలం, ఏడో రోజున ఇమామే ఖాసీం ఆలం, ఎనిమిదో రోజు అలీ అక్బర్ ఆలం, తొమ్మిదో రోజు ఇమామే ఉస్సేన్ ఆలం సవారీ వేడుకలు నిర్వహిస్తారు. మండల కేంద్రంలో ఇమామే ఉస్సేన్ సవారీ వేడుకలు ఉమ్మడి జిల్లాలో పేరుగాంచింది. ముస్లిం కుటుంబాలు మొహర్రం పది రోజులు సంతాప దినాలుగా పాటిస్తారు.